క్లుప్తంగా

నేడు కృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

రాజంపేట : రాజంపేట వైఎస్సార్ సర్కిల్ (పాతబస్టాండు)లోని రాయచోటి రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణదేవరాయల విగ్రహావిష్కరణను మంగళవారం నిర్వహించనున్నట్లు రాజంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవికుమార్ సోమవారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే విగ్రహావిష్కరణకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి పాల్గొంటారన్నారు. రాజకీయాలకతీతంగా విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

నివాళి

ఓబులవారిపల్లె : వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు జబ్బిరెడ్డి రఘునాథరెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం మండల కేంద్రంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయి కిషోర్‌రెడ్డిలు రఘునాథ్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఓబులవారిపల్లె : మండలంలోని సీఎం బలిజపల్లె గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని సోమవారం తమ సిబ్బందితో కలిసి దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్న ఐదు మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5 వేలు నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూపానందరెడ్డి దృష్టికి గ్రామ సమస్యలు

ఓబులవారిపల్లె : సంక్రాంతి సంబరాలలో భాగంగా కనుమ పండుగ అయిన సోమవారం రోజు వైఎస్సార్‌సీపీ నాయకుడు ముక్కా రూపానందరెడ్డి బొమ్మవరం గ్రామంలో నిర్వహించిన పలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు గజమాలతో స్వాగతం పలికారు. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన గౌరీదేవి (గొబ్బెమ్మ) సంబరాలలో వారు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపిపి-1 గూడూరు గౌరీ శంకర్ రాజు, సర్పంచ్ లౌడి గంగురాజు, గ్రామంలోని సమస్యలు తదితర విషయాలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాష్ రెడ్డి, గుంతకల్లు రైల్వేబోర్డు కమిటీ సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, గజ్జల శ్రీనివాసులు రెడ్డి, తల్లెం చంద్రమోహన్ రెడ్డి, తల్లెం విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

వీరబల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సందర్భంగా గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. కీ.శేలు మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌లో 30 టీమ్‌లు పాల్గొనగా ఇందులో మండలంలోని మాదిరెడ్డిగారిపల్లికి చెందిన నగిరి టీమ్ విజేతగా, ద్వితీయ స్థానంలో కేయంపల్లి టీమ్ నిలిచింది. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు మదన్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

పెనగలూరు : మండల కేంద్రంలోని గాంధీనగర్ ఎస్టీ కాలనీ మహిళలకు పెద్దల పండుగ సందర్భంగా పట్టు చీరలను స్థానిక ఉపసర్పంచ్ దేపూరు చిన్న వెంగల్ రెడ్డి పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రతి మహిళకు చీరను అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ చిన్న వెంగల్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు సంతోషంగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో సతీ సమేతంగా చీరలు పంపిణీ చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మెకానిక్‌కు గాయాలు

మదనపల్లె: ద్విచక్రవాహన ప్రమాదంలో మెకానిక్ తీవ్రంగా గాయపడిన సంఘటన ములకలచెరువు మండలంలో ఆదివారం జరిగింది. కాలువపల్లెకు చెందిన అస్లాం (20) ద్విచక్ర వాహన మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంపై ములకలచెరువుకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో అస్లాం తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నేడు వాహనాల వేలం

మదనపల్లె : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన మూడు మోటార్‌సైకిళ్లను మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వాహనాలు కొనుగోలు చేయాలని ఆసక్తి కలిగిన వారు ఉదయం 9.30 గంటలకు స్టేషన్‌కు చేరుకుని డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- ఇంటింటా రంగవల్లులు, గొబ్బెమ్మలతో అలంకరించిన మహిళలు
- ఊరూరా పశల దేవుడి ఎదుట చిట్లాకుప్పలు వేసి పశువులను బెదిరించిన రైతులు



రాజంపేట రూరల్: మహిళల సాంప్రదాయ నృత్యాన్ని తిలకిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

లక్కిరెడ్డిపల్లి : గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఇంటింటా రంగవల్లులు, గొబ్బెమ్మలతో మహిళలు ఇంటి లోగిళ్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, తమ ఇంటి దేవతలకు పూజలు చేశారు. పిండి వంటలు చేసుకొని నైవేద్యంగా సమర్పించారు. గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చాలా ప్రాంతాల్లో యువత పలు ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రైతులు పశువులను ప్రత్యేకంగా అలంకరించారు. కనుమ రోజున చికెన్ సెంటర్లు, మటన్ కొట్టులు కిటకిటలాడాయి. పశల దేవుడి వద్ద నైవేద్యం సమర్పించి, కంపతొడుగులను ఏర్పాటు చేసి చిట్లాకుప్పను సిద్ధం చేశారు.

గ్రామాల్లో కనిపించని హరిదాసులు

గత పది సంవత్సరాల క్రితం సంక్రాంతి పండుగ అనగానే హరిదాసులు, బుడబుక్కలవారు, గంగిరెద్దులు, వేమయ్య గుర్రం వారు, మొండోళ్లు ఇలా అనేక మంది పల్లెలకు వచ్చేవారు. కానీ ప్రస్తుతం వారు ఎక్కడా కనిపించకపోవడం పండుగపూట కళ తప్పినట్లైంది. తెలుగు వారి ఆత్మీయత, అనురాగాలకు ప్రతీక సంక్రాంతి పండుగని జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా గుడ్లవారిపల్లెలో మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, అనంతపురం సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, వైయస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు పోటీలల్లో గెలుపొందిన వారికి బహుమతులను, నగదు ప్రోత్సాహంను అందజేశారు.



సిద్దవటం: సీతా రాముల చిత్రపటాన్ని ఊరేగింపు చేస్తున్న దృశ్యం

సంక్రాంతి సందర్భంగా చీరల పంపిణీ

వీరబల్లి : సుండుపల్లె మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు డీవీఎస్ చక్రవర్తిరెడ్డి, డి.రామ్ సునీల్‌రెడ్డి 300 మంది పేద మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు.

ఘనంగా సీతారాముల ఊరేగింపు

సిద్దవటం : మండలం కేంద్రమైన సిద్దవటం దిగువపేట గాంధీ వీధిలోని శ్రీ రామాలయం నుంచి ఆదివారం రాత్రి సీతారాముల చిత్రపటాన్ని ఊరేగింపు కార్యక్రమాన్ని స్థానికుల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగను పురష్కరించుకొని గ్రామంలోని యువకులు సీతారాముల భజన పాటలు పాడుకుంటూ ఊరేగింపు చేశారు.

కనుల పండువగా ముగిసిన సంక్రాంతి పర్వదిన వేడుకలు

సంబేపల్లె : మండల వ్యాప్తంగా సంక్రాంతి పర్వదిన వేడుకలను ప్రజలు కనుల పండువగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు విచ్చేసిన ప్రజలతో గ్రామాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో పలు రకాల పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సమీప ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చిట్లాకుప్పల వద్ద చాందినీ బండ్లను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి సర్పంచ్ అలివేలమ్మ బహుమతులు అందజేశారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలను ప్రజలు అంబరాన్నంటే విధంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే స్నానాలు ఆచరించి తమ పశువులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం కాటమరాజుకు పూజలు నిర్వహించి చిట్లాకుప్పల వద్ద తిప్పారు. పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగ్గుల పోటీలు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీలో మండలస్థాయి ముగ్గుల పోటీలను తలమంచి గిరీష్ రెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ధనుంజయ రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో 106 మంది పాల్గొన్నారు. విజేతలకు, పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి వచ్చిన మహిళలకు చీరను అందజేశారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మండల వైస్ ప్రెసిడెంటు కొండూరు విజయ్ రెడ్డి, తలమంచి ధనుంజయరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, బీఎల్ నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, తలమంచి గిరీష్ రెడ్డి బహుమతుల పంపిణీలో పాల్గొన్నారు.



రాయచోటి టౌన్: వీరబ్రహ్మస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చిట్లాకుప్ప

పేదలకు చీరల పంపిణీ

పుల్లంపేట : సంక్రాంతి సందర్భంగా పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి తల్లిదండ్రులు ముద్దా వెంకటసుబ్బారెడ్డి, ముద్దా మనోరంజనమ్మల జ్ఞాపకార్థం 1000 మంది పేద మహిళలకు చీరలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది మకర సంక్రాంతి రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్వహిస్తానన్నారు.

ఘనంగా ముగిసిన సంక్రాంతి వేడుకలు

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారు సొంతూళ్ళకు రావడంతో ముఖ్యంగా పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి రోజున ప్రజలు పరమపదించిన పెద్దలకు, ఇతర కుటుంబ సభ్యులకు దుస్తులు పెట్టుకొని పూజలు చేశారు. కనుమ పండుగ రోజు అనేక గ్రామాల్లో పెద్దఎత్తున పశువుల కుప్పలకు నిప్పటించి, ఆ కుప్ప చుట్టూ పశువులను తిప్పారు. సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని వివిధ గ్రామాల్లో క్రీడలు నిర్వహించి విజేతలకు ఆ గ్రామాల పెద్దలచే బహుమతులను ప్రదానం చేశారు. పలు గ్రామాల్లో గొబ్బెమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొని గొబ్బెమ్మ పాటలు పాడుతూ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు. మిత్రులను ఆహ్వానించి విందులు ఇచ్చారు.

మారెమ్మకు పొంగళ్లు

మండలంలోని వైబీఎన్‌పల్లె గ్రామంలో వెలసిన మారెమ్మకు కనుమ పండుగను పురస్కరించుకొని పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా మహిళలు 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు.



పెనగలూరు: మొదటి బహుమతిని అందిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

చెయ్యేరులో..

నందలూరు(రాజంపేట) : చెయ్యేరులో సోమవారం సాయంత్రం సంక్రాంత్రి సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రజలందరూ చెయ్యేరులో ఉత్సాహంగా ఆటపాటలతో కాలం గడిపారు. చెయ్యేరులో నిర్వహించిన ఎద్దుల బండి పోటీలను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రారంభించారు.

కొండాయపల్లెలో చీరల పంపిణీ

మండలంలోని ఆడపూరు పంచాయతీ పరిధిలోని కొండాయపల్లెలో రాజంపేట పార్లమెంటరీ యూత్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసాద్ యాదవ్, చైతన్య వర్మ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, సర్పంచి గీతాల శిరీషా, మండలపార్టీ కన్వీనరు గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు సంక్రాంతి ప్రతిబింబం

రాజంపేట రూరల్ : హిందూ ఆచారాలకు, సంప్రదాయాలకు సంక్రాంతి వేడుకలు ప్రతిబింబాలుగా నిలుస్తాయని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. గొబ్బెమ్మకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గొబ్బెమ్మ పాటలు, సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా కనుమ సంబరాలు

రాయచోటి టౌన్ : సంక్రాంతి సంబరాలలో భాగంగా చివరి కనుమ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి పశువులను అందంగా అలంకరించి చిట్లాకుప్ప వద్దకు వేడుకగా తీసుకెళ్లారు. వ్యవసాయంలో ఇన్ని రోజులు ఎంతో సహకరించిన ఆవులు, ఎద్దులను ఉదయం నుంచి అందంగా అలంకరించేందుకు రైతులు నిమగ్నమయ్యారు. అనంతరం సరదగా చిట్లాకుప్ప వద్దకు తీసుకెళ్లి చిట్లాకుప్పకు (పెద్ద బోగి మంట) నిప్పు పెట్టించి ఎద్దు, ఆవులను పరుగెత్తించి సంబరాలు జరుపుకున్నారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇంటికి వచ్చిన బంధు మిత్రులతో కలిసి పండుగను ఆహ్లాదంగా జరుపుకున్నారు. ఇండ్లలో రకరకాల పిండి వంటలు చేసుకున్నారు. చివరి రోజైన సోమవారం ఆయా గ్రామాల పరిధిలో చిట్లా కుప్పవేసి పశువులను అలంకరించుకొని కుప్ప వద్దకు తోలుకొని పోయి దాని చుట్టూ పశువులను తిప్పారు.



పుల్లంపేట: పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, దొండ్లోపల్లి మణి

చిట్వేలిలో..

చిట్వేలి : మండలంలో సంక్రాంతి, కనుమ వేడుకలను ఆది, సోమవారాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మహిళలు ఇంటి ముంగిట రంగవల్లులు వేయడంతో ప్రారంభమైన వేడుకలు కనుమ పండుగ రోజున గోపూజతో ముగిశాయి. పాడి రైతులు తమ పశువులను అందంగా అలంకరించి గోపూజ నిర్వహించి తమ ఇంట్లో పాడి సమృద్ధిగా ఉండాలని మొక్కుకున్నారు. చిట్వేలి సుబ్బు శర్మ గోశాలలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. పండుగ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

ఘనంగా కాటమ దేవుడికి పూజలు

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె గ్రామంలో కనుమ పండుగ సందర్భంగా సోమవారం ప్రజలు కాటమదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పొంగుబ్యాళ్లు నిర్వహించారు. పశువుల పండుగ కనుమ రోజున గ్రామంలోని కాటమదేవుడికి పూజలు నిర్వహించి చిట్లా కుప్పలను ఏర్పాటు చేసి వాటి మధ్యలో గ్రామంలో పశువులను తోలారు.

ఘనంగా గౌరీదేవి నిమజ్జనం

సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో అమ్మవారిశాలలో గౌరీ దేవిని ప్రతిష్ఠించి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో గ్రామస్తులు గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఏడాది గౌరీదేవి గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహించి, నిమజ్జనం చేయడం ఆచారంగా వస్తోందని తెలిపారు

సైనికునిగా సేవలందించడం మహాభాగ్యం


నందలూరు(రాజంపేట) : సైనికునిగా దేశానికి సేవలందించడం మహాభాగ్యమని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్మీ డే సందర్భంగా నాగిరెడ్డిపల్లె సచివాలయం కూడలిలో ఆదివారం రాత్రి ఘనంగా సైనికుల దినోత్సవ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభద్రతకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించే వారు ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క దేశ సైనికులేనన్నారు. దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసినవారు ఎందరో ఉన్నారన్నారు. వారందరి సేవలను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత దేశపౌరులకు ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, సర్పంచి సూర్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు కలీం, రాష్ట్ర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి హిమగిరి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వైనరసింహ శెట్టి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ కన్వీనర్ మన్సూర్ అలీ, ఎస్టీయూ నేత అల్లం అశోక్, లయన్స్ క్లబ్ ప్రతినిధి మణి యాదవ్‌లు సైనిక్ దినోత్సవం గురించి ప్రసంగించారు. నందలూరు పరిసర ప్రాంతాలకు చెందిన సైనికులను ఆర్మీ డే సందర్భంగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మైనుద్దీన్, బీసీనేత తుమ్మల శ్రీధర్‌గౌడ్, మాజీ ఏజీపీ షేక్ పాల్గొన్నారు.



సైనికులను సన్మానిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

స్మృతివనంలో విరిసిన స్నేహ సుగంధం

రాజంపేట టౌన్ : చిన్ననాటి మిత్రుల కలయికకు సంక్రాంతి ఓ వేదికైంది. పండగకు అనేక మంది సొంతూళ్ళకు వస్తారు. దీంతో స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 1984-85వ సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం అదే పాఠశాలలోని సెంటర్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేశారు. యాభై ఏళ్ళు పైబడి ఉన్నప్పటికి అనేక సంవత్సరాల తరువాత చిన్ననాటి మిత్రులందరిని చూడగానే అందరి మోములు తామరపువ్వులా విచ్చుకొని ఆనందంతో తొణికిసలాడాయి.



మూడు దశాబ్దాల అనంతరం కలుసుకున్న చిన్ననాటి మిత్రులు

దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడా

రాజంపేట రూరల్ : ప్రతి ఇంట సంక్రాంతి శోభ వెల్లివిరియాలని ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని తాళ్లపాక గ్రామంలో ఆదివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టారు. మహిళలకు చీరలు, పురుషులకు పంచె, టవల్ పంపిణీ చేయడంతో వారి కుటుంబాలలో ఆనందం నెలకొంటుందని ఎమ్మెల్యే మేడా తెలిపారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం మృకండాశ్రమానికి చెందిన మృతుడు బాలరాజు కుటుంబానికి రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోమవారం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారని కొత్తమాధవరం సర్పంచ్ పన్నెల చంద్ర తెలిపారు. మృతుడు బాలరాజు రైలు యాక్సిడెంట్‌ను చూసిన తల్లి గుండెపోటుతో మృతి చెందడంతో ఆధారంలేని కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన మృతుడి సతీమణి రాజేశ్వరికి రూ.50 వేలు అందజేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిల్లర్ పసుపులేటి సుధాకర్, పాలగిరి మల్లికార్జునరెడ్డి, రామక్రిష్ణ, వడ్డే శ్రీను తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

సంక్రాంతి సంబరాల్లో మంత్రి రోజా

సంబేపల్లె : మండలంలోని శెటిపల్లె గ్రామం తిమ్మక్కగారిపల్లెలో జరిగిన సంక్రాంతి సంబరాలలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా పాల్గొన్నారు. ఆమె సోదరుడు మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రారెడ్డి స్వగృహంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోమాతకు పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీలలో ఆమె పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కవిత, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనంద్ రెడ్డి, రోజా కుటుంబ సభ్యులు, ఉపేంద్రారెడ్డి కుటుంబసభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరణ

మంత్రి రోజా యువతేజ కల్చర్ ఈవెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువతేజ వారి కల్చరల్ ఈవెంట్స్‌ను ఆసక్తి ఉన్న వారు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈవెంట్ ఆర్గనైజర్ అనిల్‌కుమార్, నాయకులు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిమ్మక్కగారిపల్లెలో గోపూజలో పాల్గొన్న మంత్రి ఆర్‌కే రోజా

మంత్రి, ఎంపీలకు ఘనస్వాగతం

సంబేపల్లె : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డిలకు మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. వీరబల్లిలోని పెద్దిరెడ్డి బంధువుల ఇంటికి వెళ్తున్న మంత్రి, ఎంపీలకు గుట్టపల్లెలోని చిదంబర్‌రెడ్డి నివాసం వద్ద శాలువా, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం తేనీటి విందుకు స్వీకరించిన వారు వీరబల్లికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సారా విక్రేత అరెస్టు

మదనపల్లె: అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ ఎస్.ఐ హరిహర ప్రసాద్ తెలిపారు. మండలంలోని నారమాకు తాండాకు చెందిన బాలాజీనాయక్ ఆదివారం పట్టణంలోని ఎస్‌వీఆర్ కళ్యాణ మండపం సమీపంలో సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

నేడు మల్లయ్యకొండ అన్నదాన కమిటీ సమావేశం

తంబళ్లపల్లె: ఆదర్శ పాఠశాల ఆవరణంలో మంగళవారం ఉదయం 10గంటలకు అన్నదాన సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి తెలిపారు. శివరాత్రి పర్వదినానికి కొండకు వచ్చే భక్తులకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నసంతర్పణ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు, నిర్వహణ బాధ్యతలు, నిధుల సమీకరణ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

పీలేరు రూరల్ : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గోదాదేవి, రంగనాథుడిని శోభాయమానంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. పలువురు ఆర్యవైశ్యులు కల్యాణం తిలకించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి అమ్మవారిని పల్లకీలో కోలాటాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో అరవింద్‌బాబు, సుప్రజ, నరేష్, స్వాతి దంపతులు, పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండకు గోమాత దానం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయానికి గోమాత, దూడను దానంగా ఇచ్చారు. తిరుపతి పట్టణానికి చెందిన భరత్‌భుషణ్ కుటుంబ సభ్యులు సోమవారం ఆలయానికి చేరుకొన్నారు. ముందుగా గోమాత, దూడకు విశిష్టపూజలు నిర్వహించి ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, అర్చకులకు అందజేశారు. వీటిని ఆలయం తరఫున సంరక్షిస్తామని చైర్మన్ తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

– కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి

సిద్దవటం : ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు ఉంటాయని కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి హెచ్చరించారు. సిద్దవటం మండలంలోని కడపాయపల్లె పంచాయతీ మంగనవాండ్లపల్లె గ్రామాన్ని సోమవారం కడప డీఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో శాంతి భద్రతలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇక్కడ సమస్యలు ఏవైనా ఉన్నాయా, గొడవలు ఏవైనా జరుగుతున్నాయా, జూదం, మట్కా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు తెలిపారు. గ్రామానికి సంబంధించి మరిన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సైబర్ నేరాలకు బాధితులు కాకూడదని, ఏవైనా కొత్త యాప్‌లను ఇన్‌స్టాల్ చేయకూడదని, స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధనంజయరెడ్డికి ఆత్మీయ స్వాగతం

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి సలహాదారులు రక్కసి ధనుంజయరెడ్డి తొలిసారిగా తల్లెంవారిపల్లె గ్రామానికి రావడంతో గ్రామస్తులు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ధనుంజయరెడ్డి అవ్వగారి ఊరైన తల్లెంవారిపల్లె గ్రామానికి వచ్చారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తూ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం శాలువా, పూలమాలతో సత్కరించారు. భారీ కేక్‌ను ధనుంజయరెడ్డి చేత కట్ చేయించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరిస్తానని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, యువ నాయకులు చిన్నిరెడ్డి అశోక్ కుమార్‌రెడ్డి, కొమ్మూరు భాస్కర్‌రెడ్డి, చిన్నిరెడ్డి గురివిరెడ్డి, నాగినేని రమేష్‌నాయుడు, చిన్నిరెడ్డి చంగల్‌రెడ్డి, కొలవల అమర్నాథరెడ్డి, అరవ సుధీర్ కుమార్ రెడ్డి, జబ్బిరెడ్డి మనోహర్‌రెడ్డి, కొలవల ప్రభాకర్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: కేక్‌ను కట్‌చేస్తున్న ధనుంజయరెడ్డి

రైల్వేకోడూరులో...

రైల్వేకోడూరు : పట్టణంలో కనుమ పండుగను పురస్కరించుకుని సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు ధనుంజయ్‌రెడ్డిని కలిసి పలువురు నాయకులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యంగా ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, టంగుటూరి క్రిష్టారెడ్డిలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పంచాయతీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం

రైల్వేకోడూరు : అనంతరాజుపేట పంచాయతీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకుడు పంజం సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అనంతరాజుపేట పంచాయతీలోని స్వగ్రామమైన తంబిళ్ళవారిపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. గ్రామంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ధనుంజయరెడ్డి సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. 2024 ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి రైల్వేకోడూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, సీఎం జగన్‌కు బహుమతిగా ఇద్దామని కార్యకర్తలకు సూచించారు. పంచాయతీలో మూడవ సచివాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సలహాదారులు రక్కాసి దనుంజయరెడ్డిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంజం విజయ రంగారెడ్డి, ఆకేపాటి రంగారెడ్డి, బండారు మల్లికార్జున, రామచంద్రారెడ్డి, డబ్బి సిద్దయ్య, బర్ది, రామచంద్ర, నాగరాజు, కుమార్‌రెడ్డి, శివ, గంగయ్య, రమణ, వినోద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న పంజం సందీప్‌రెడ్డి

కోడి పందేల స్థావరాలపై దాడులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఎస్‌ఐ మధురామచంద్రుడు సిబ్బందితో కలసి కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించారు. మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కాప్పల్లి సమీపంలో ప్యాయల సురేష్, గిరిగి రమేష్, నెలవంకి రమేష్, ప్యాయల రాజన్న, మేకల వెంకట్రాయప్ప, ఆర్‌వీ రమేష్‌లు పట్టుబడ్డారు. వారి నుంచి 10,200ల నగదుతో పాటు మూడు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. టి.సదుం పంచాయతీ సమీపంలోని చింతచెట్టు వద్ద ఎంవీ రవిచంద్ర, కుళ్ళాయప్ప, అంజనప్పలు పట్టుబడగా వారి నుంచి 1,250ల నగదుతో పాటు ఓ కోడి పుంజును స్వాధీనం చేసుకున్నామని సోమవారం ఎస్‌ఐ పేర్కొన్నారు. జూదమాడితే కఠిన చర్యలుంటాయని తెలిపారు.

నలుగురు అరెస్టు

ములకలచెరువు: మండలంలో కోడిపందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ డీవై స్వామి సోమవారం తెలిపారు. సోంపల్లి పంచాయతీ సానేవారిపల్లె వద్ద కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నలుగురిని అరెస్టు చేసి రూ.3,300 వేల నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.